# కృష్ణమ్మ ఘోష... వినండిబాబు...

– జనవిజ్ఞానవేదిక

మహారాష్ట్రలోని మహాబలేశ్వరంలో పుట్టి – కృష్ణాజిల్లా, హంసలదీవి (కోడూర్) వద్ద బంగళాఖాతంలో కలుస్తున్న జీవనది కృష్ణానది. పుట్టినప్పటినుండి తన సుగుణాన్ని, (స్వచ్ఛతను) కాపాడుకుంటూ తన బిడ్డలను చల్లగా చూస్తున్న జీవనది మన కృష్ణమ్మ. కృష్ణా పుష్కరాల పేరుతో మనం జరుపుతున్న ఆడంబరాలకు అయోమయ స్థితిలో కృష్ణమ్మ ఉంది. కృష్ణాపుష్కరాల సందర్భంగా, తన బిడ్డలలో ఒక బిడ్డను కృష్ణమ్మ పలకరించింది.

కృష్ణమ్మ : ఓరే నాయనా ! బాగున్నావా !

కుమారుడు : ఎవరువమ్మా నీవు !

కృష్ణమ్మ : నేనురా ! మీ అమ్మను, కృష్ణమ్మను, నేను లేకుండా జీవించలేవుగదరా ! నన్నే మరచిపోయావా ! రోజు నాతో స్నానం చేస్తావు. అన్నం వండుకోవటానికి, బట్టలు ఉతకటానికి, ఆహార పంటలు పండించటానికి (కూరగాయలు, వరి మొ।।నవి) నన్నేగదరా ఉపయోగించేది.

కుమారుడు : అమ్మానీవా ! బాగున్నావా తల్లీ.

కృష్ణమ్మ : ఏం బాగురా, నాయనా ! నన్ను నన్నుగా ఉండనిస్తున్నారా మీరు.

కుమారుడు : ఏం తల్లి అలా అన్నావు. నీ కొచ్చిన ఇబ్బందేమిటి?

కృష్ణమ్మ : ఇబ్బందేమిటని మెల్లిగా అంటావేవిరా! పుట్టినప్పటి నుండి, మీ తాతలు, ముత్తాతలు, తండ్రులకు, పశువులకు, చెట్లకు, చేపలకు సకల జీవరాసులకు ఆరోగ్యకరమైన, బలమైన నీటిని అందిస్తూవచ్చాను. వారు నా స్వచ్ఛతను (సుగుణాన్ని) కాపాడి, నా వలన లబ్ధిపొందారు. మరి, ఇప్పుడు!

కుమారుడు : నీ స్వచ్ఛతకు ఇప్పుడొచ్చిన ఇబ్బందేమిటి తల్లి?

కృష్ణమ్మ : వ్యర్థ పదార్థాల ద్వారా నన్ను కలుషిత పరుస్తున్నారుగదరా! తద్వారా నాలోని స్వచ్ఛతను, సుగుణాలను రోజురోజుకు పోగొట్టుకుంటున్నాను.

కుమారుడు : నీవేవింటి, కలుషితమవటం ఏవింటి? నాకు అర్థం కావటంలేదు తల్లీ.

కృష్ణమ్మ : అర్థం కాకపోవటం ఏమిట్రా! పరిశ్రమలలోని వ్యర్థపదార్థాలన్నీ, రసాయనాల ఎరువులు, క్రిమి సంహారక మందులు, ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్, పెట్టెలు, కర్బన ఇంధనాలు, శవాలు, సబ్బులు, షాంపులు, నూనెలు మొ।।లగు అనేక వాటిని నాలో పడేస్తున్నారు. ఇవికాక, మీ పిల్లలు, జంతువుల, మీ మలిన పదార్థాలన్నీ నాలోనే కలుపుతున్నారు. నా స్వచ్ఛత ఎక్కడుంటుంది చెప్పరా! మీ తాతలు, ముత్తాతలు, నన్నిలా చూసుకున్నారు. మీరెలా చూసుకుంటున్నారు. వినాశకాలే విపరీతబుద్ధి అంటే ఇదేరా! నాయనా!

కుమారుడు : అమ్మా మమ్మల్ని శపించకమ్మా !

కృష్ణమ్మ : **శాపం కాదురా! నన్ను సరిగా అర్థం చేసుకోలేక పోతున్నందుకు బాధపడుతున్నాను. అజ్ఞానంతో మూఢ నమ్మకాలతో కష్టాల పాలవద్దని హెచ్చరిస్తున్నాను. మీ తల్లిని చూసుకొనే పద్ధతి ఇది కాదని చెబుతున్నాను. నా మీద (కృష్ణానదిపై) పుష్కర ఘాటుకు కేవలం 100 మీటర్ల**

దూరంలో రైలు బ్రిడ్జి, 200 అడుగుల దూరంలో ప్రకాశం బ్యారేజి కట్టుకున్నారు. నేనేమైనా అన్నానా! లేదే, నాకు భారమైనా నా బిడ్డలకోసం భారాన్ని భరిస్తున్నాను. కాని ఘాటుల నిర్మాణానికని 100 మీటర్లలోపే పెద్దపెద్ద కందకాలు పెట్టి, ఇసుకను తోడేస్తున్నారు. దీని వలన రైలు బ్రిడ్జితో పాటు, ప్రకాశం బ్యారేజికి ఏమైన ప్రమాదం సంభవిస్తే నన్ను (కృష్ణానదిని) నిందించవద్దు. ఇసుక త్రవ్వి, వదిలేసిన గుంటలలో నీరు చేరి, స్నానాలాచరించే సందర్భంలో ఆ గుంటలో పడి చనిపోతే, కృష్ణమ్మ పొట్టన పెట్టుకుంది అని నన్ను అనొద్దు. ఎందుకంటే? ప్రసిద్ధమైన కట్టడాలున్నచోట, 500 గజాల దూరం వరకు ఎలాంటి త్రవ్వకాలు చేపట్టరాదనే నిబంధనలున్నాయిరా అబ్బాయి. కాంట్రాక్టర్లు వేరు చోటనుండి ఇసుకను తెచ్చి, ఘాట్‌లు నిర్మించాలి, కాని, నా ఇసుకను త్రవ్వి నన్ను బాదిస్తున్నారు. మిమ్ములను ప్రమాదానికి గురిచేస్తున్నారు. అయినా మీ ప్రభుత్వమేమిట్రా చిత్రం చూస్తున్నది. చోద్యంకాకపోతేనూ.

కుమారుడు : నీవు చాలా బాధపడుచున్నట్లున్నావు తల్లీ!

కృష్ణమ్మ : బాధ కాకపోతే, మరేంటిరా! 12సం॥రాల కొకసారే నాకు పవిత్రత వస్తుందా! మిగతా రోజులలో నాకు పవిత్రత ఉండదా! నేనంత సంకుచితరాలినా! మీ ప్రభుత్వాలేమిట్రా ఫలానరోజున రండి, స్నానం ఆచరించండని, వందలకోట్లు ఖర్చుపెట్టి ప్రచారం చేస్తూ, నన్ను అవమానిస్తున్నారు. మీ ప్రభుత్వాలు, మూఢనమ్మకాలను తుంచుతున్నాయా లేక పెంచుతున్నాయా : నాకు అర్థం కావటంలేదు. నా బిడ్డలను, ఆ రోజుతప్ప, మిగతా రోజులలో ఆశీర్వదించనా. ఇదేమివిడ్డూరంరా నాయనా. నా బిడ్డలు, ఇలాంటి మూఢనమ్మకాలతో జీవిస్తున్నందుకు బాధపడుచున్నానురా! కుమారా!

కుమారుడు : నాకు అర్థం అయింది తల్లీ, ఇప్పుడు మమ్ములను ఏమి చెయ్యమంటావు చెప్పుతల్లి!

కృష్ణమ్మ : నేను (కృష్ణమ్మ) ఇందుగలను, అందులేనని సందేహంబు వలదు. ఎందెందు వెతికినా అందందే నేనుంటాను. బావిలోను, బోరింగులోను, ట్యాంక్‌లోను, నదులలోను, సముద్రంలోను నేనే, (మూడువంతుల నీరు, ఒకవంతు నేల) అన్నింటా నేనే. అందువలన గుంపులు గుంపులుగా ఒకచోట స్నానంచేసి రోగాలు తెచ్చుకోక, ఎక్కడి వారు అక్కడే స్నాన మాచరించండి.

కుమారుడు : అలాగే తల్లీ, నీవు చెప్పినట్లే చేస్తాము.

విజ్ఞానాభినందనలతో


**జన విజ్ఞాన వేదిక**

Regd. No. 1276/88 (AIPSN అనుబంధం)

**విజయవాడ నగర కమిటి**

**ఫోన్ : 72079 00567, 90521 86766**



సమాజంలో వస్తున్న మార్పుల

శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక రంగాల్లో పరిణామాల

విద్య, ఆరోగ్యం, అభివృద్ధి అంశాలపై సమగ్ర విశ్లేషణ కోసం



జనవిజ్ఞానం

మైమాసిక పత్రిక

సామాజిక మార్పుకోసం

ప్రచురణ : జనవిజ్ఞాన వేదిక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

ఎడిటర్ : డా॥ ఎం. గేయానంద్

చదవండి... చదివించండి...

ప్రతులకోసం : ఎస్. శంకరయ్య, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, 9440541020

లేదా మీ జిల్లా జనవిజ్ఞాన వేదిక బాధ్యులను సంప్రదించండి.